# శలభాలు

మీనాక్షమ్మకు తమ పొరుగింటిలోకి ఎవరో కాపరానికి వచ్చారని అప్పుడే తెలిసింది. ఒక అరగంటలో పంపిన మనిషి తిరిగి వచ్చాడు- "ఒక్క అయ్యగారే ఉంటున్నారు. 27 లేక 28 సంవత్సరాల వయసు ఉంటుంది. మన అబ్బాయిగారి కంటె ఒక చాయ తెలుపు-కాస్త పొడుగు-తటాలున చూస్తే అబ్బాయిగారిలా ఉంటాడు. వెంబడి వంటమనిషి కాబోలు ఉన్నాడు" అన్న సమాచారముతో.

ఈ వివరాలతో మీనాక్షమ్మ ఒక చక్కని రూపకల్పన చేసుకున్నది. మనసులో ఆ ఊహలు వాయువేగ మనోవేగములతో పరుగెత్తటము మొదలుపెట్టాయి. "అబ్బాయికంటె ఒక చాయ ఉంటే అందగాడిక్రింద లెక్క. తటాలున చూస్తే అబ్బాయిలా ఉన్నాడంటే ఏమర్థము? అబ్బాయి అమెరికా వెళ్ళి మూడేళ్ళు ఉండి వచ్చిన నాగరికుడు.

వెంటనే ఆమెకు పొరుగింటాయన ఈ మాదిరిగా ఉంటాడని ఒక నిశ్చితమైన అభిప్రాయ మేర్పడ్డది. ఎక్కువ ఆలస్యము చేయకుండా చిన్న కొడుకును పంపి అతడి సైన్ బోర్డును చూచిరమ్మంది. రెండు నిమిషాలు కాకముందే దాని మీద ఉన్న విషయము 'రఘువీర్-అబ్కారీ ఇన్‌స్పెక్టరు' అన్న వార్త తెలిసింది.

ఆరోజు ఉదయము పదకొండు గంటల దగ్గరనుండి సాయంకాలము అయిదుగంటల వరకూ మీనాక్షిమ్మ తహతహలాడి పోయిందంటే అందరూ నమ్మరు.

ఆరోజు జీడిపలుకులు వేసిన ఉప్మా రామశర్మ యింటికి రాగానే మీనాక్షమ్మ స్వయముగా అందించి-చిక్కటి కాఫీ పెద్దగ్లాసుతో ఇచ్చింది. సిగరెట్టును నోటి కందించుతూ "అట్లా చల్లగాలికి వెళ్ళదాము రారూ?" అన్నది.

ఎన్నడూ ఎరుగని ఈ గౌరవ మర్యాదలకు శర్మ విస్తుపోయాడు. మనసులో తట్టిన ఊహను అంత తొందరగా బైటపెట్టని స్వభావమే ఆమెతో కాపు

రము చేస్తున్న ఈ పాతికేళ్ళ నుండీ చాలా రక్షిస్తున్నది అతడిని. వెంటనే తల ఊపి చెప్పులు వేసుకొని బయలుదేరాడు. ఆమె తృప్తికరముగా ముఖముపెట్టి అతడిని అనుసరించింది.

వాళ్ళిద్దరూ ఎటు వెళ్ళాలనుకున్నారో గాని - మరో అయిదు నిమిషాలకు పొరుగింటి ముందర నిలబడి ఉన్నారు. గోడకు తగిలించిన సైన్‌బోర్డును ఆమె ఆయనకు చూపిస్తూ మిగిలిన వివరాలన్నీ ఒక్క గుక్కలో చెప్పింది.

మీట నొక్కితే గంట మ్రోగినట్లుగా - అతడు తలవంచుకొని నడుస్తూ "అవును అవును" అన్నాడు.

మరునాడు అతడు కచేరీనుంచి వచ్చేసరికి మసాలాదోసె చేతికి వచ్చింది. అతడు ఖాలీచేసిన ప్లేటును మీనాక్షమ్మ స్వయముగా అందుకొన్నది. అతడు కాఫీ త్రాగగానే-మాటల సందర్భములో చెప్పినట్టుగా మీనాక్షమ్మ చెప్పింది. "ఆ ఇన్‌స్పెక్టరుగారట దత్తపుత్రుడట! తోటలు దొడ్లు ఉన్నాయట - నగరములో రెండు పెద్ద ఇళ్ళు ఉన్నాయట-చక్కగా చిన్నతనములోనే మంచి ఉద్యోగము కుదిరింది కదండీ!"

"నిజమే-నిజమే! మంచి ఉద్యోగమే. చిన్న తనముకూడాను" వెనుకటి ధోరణిలోనే అన్నాడు శర్మ.

నాలుగు రోజులైన తరువాత మీనాక్షమ్మ నౌకరును పొరుగింటికి పూల కొరకు పంపి "అమ్మాయిగార్లకు అరంగు పూలంటే ఎంతో యిష్టము. పెరట్లో వున్నవి కోసుకో వచ్చునా?" అని అడగమన్నది.

వెళ్ళినవాడు వెంటనే తిరిగి వచ్చాడు. "దత్తుగారి అమ్మాయిలు ఉదయము ఏడుగంటలకే వచ్చి కోసుకుపోయా" రని చెప్పాడు.

మీనాక్షమ్మ తెల్లబోయింది. "పొరుగింటి ఆయనను గురించి దత్తుగారింట్లో అంత తొందరగా ఎట్లా తెలిసింది?"

సాయంకాలము రామశర్మ యింటికి రాగానే ఒక తీర్మానము ఆయన ముందర పెట్టింది. ఆయన "అంతకంటేనా!" అనుకుంటూ చెప్పినపని చేశాడు.

మరునాడు సాయంత్రము ఆయిదింటి వరకూ మీనాక్షమ్మ కూతుళ్ళూ ముగ్గురూ నైలాన్ చీరెలు కట్టుకుని ముస్తాబై సిద్ధముగా ఉన్నారు. ఉపాహార విందుకు సర్వమూ సిద్ధముగా ఉన్నది. కూతుళ్ళతో మీనాక్షమ్మ గడపదగ్గరే నిలబడి ఎదురుచూస్తున్నది అతిథికొరకు.

రామశర్మ ఆనాలుగింటికే ఇంటికి రావలసింది. ఆయన రాకపోవటము మీనాక్షమ్మకు కొంత కొరతగానే ఉన్నది. కాని ఆ కారణముచేత ఏలోటూ జరుగ కూడదన్న పట్టుదల ఉండటమువల్ల ఉత్సాహాన్ని ఇనుమడింప చేసుకున్నది.

సరిగా సమయానికి వచ్చిన అతిథిని చూడగానే ముఖము ప్రఫుల్లమయింది మీనాక్షమ్మకు. ఎదురుగా వెళ్ళి తీసుకొనివచ్చి కూర్చోబెట్టింది. తన కూతుళ్ళను ముగ్గురినీ పిలిచి ఒక్కొక్కరినీ ఆయనకు పరిచయము చేసింది.

"వారు ఎంతో సరదాపడి మిమ్మల్ని అల్పాహారవిందుకు పిలిచారుగాని— పాపము రావటానికి ఏదో అననుకూలమువచ్చి ఉంటుంది. మీరు అన్యథా భావించ కండి" అంటూ క్షమాపణ కోరింది.

అతడు తగినట్లుగా సమాధానము ఇచ్చి - ముఖావముగా- స్వల్పముగా ఫలాహారము తీసుకున్నాడు.

"వీటి రుచి మీకు సరిపడలేదేమో!" అన్నది కాస్త నొచ్చుకుంటూ.

"లేదండీ. రాత్రి దత్తుగారింట్లో విందు భోజనము. ఇంకా నేను దానినుంచి తేరుకోలేదు"—అన్నాడు.

మీనాక్షమ్మకు దేహములో విద్యుచ్ఛక్తి ప్రవహించినట్లయింది. "తాను అల్పాహార విందుకు ఆహ్వానించకముందే వాళ్ళు తనకంటె ఒక అడుగు ముందు వేస్తున్నారు మొదటినుంచీ!" అనుకున్నది.

అతిథి సెలవు తీసుకుంటూ "విద్యావంతులూ సంస్కారులూ ఆయన మీ కూతుళ్ళ పరిచయభాగ్యము లభించినందుకు చాలా సంతోషంగా ఉన్నది. ఈ ఊరు నాకు నచ్చింది. అందులో ఇల్లు చక్కగా పొందికగా బాగా కుదిరింది. మంచి పొరుగు-ఒక గొప్ప విశేషము!" అన్నాడు.

మీనాక్షమ్మ మనసు పండు వెన్నెలయింది. అతడికి ప్రత్యేకముగా ఆ యిల్లు నచ్చటములోనూ-నచ్చినదని తనకు చెప్పటములోనూ ఏదో ప్రత్యేకత ఉండే ఉంటుంది. దత్తుగారి ఇల్లు కనబడుతునేవున్నా అవతల వీధిలో ఉన్నది. అందు లోనూ తన కూతుళ్ళందరూ విద్యావంతులన్న ప్రశంస కూడా వచ్చింది. విద్య దేమిటి-ఎవరికయినా వస్తుంది- కాని సంస్కారము వంటపట్టాలంటే మాటలా? ఆ మాటే కదా అతడు వెళ్ళుతూ వెళ్ళుతూ తన కూతుళ్ళవంక చూస్తూ అన్నది?

ఒకరోజు సాయంత్రము మీనాక్షమ్మ కూతుళ్ళను తీసుకొని క్లబ్బుకు వెళ్ళింది. అక్కడ దత్తుగారి అమ్మాయిలు టేబిల్‌టెన్నిసు ఆడుతున్నారు. మీనా క్షమ్మ కూతుళ్ళతో కాసేపు ఆడి, వాళ్ళు బయలుదేరారు.

"అంత తొందరపడతారేమిటి? ఉండండి మేమూ వస్తాము" అన్నది మీనాక్షమ్మ పెద్దకూతురు.

"ఇక్కడికి కొత్తగా వచ్చారే రఘువీర్ ఇనస్పెక్టరుగారు - ఆయన ఈ సాయంత్రము మా యింటికి వస్తానన్నారు. సంగీతపు పోటీ పెట్టారు మా యింట్లో" అన్నది.

మీనాక్షమ్మ పెద్దకూతురికి ఆవేశ మెక్కువై "ఆయనకు అసలు సంగీత మంటే అభిరుచి లేందేనా! అందులో మన కర్ణాటక సంగీతమంటే బొత్తిగా లేదు. ఇంకా భరతనాట్యములో బాగా అభిరుచి ఉన్నది"—మొదట ఏమీ అనకూడదను కున్నది గాని ఆపుకోలేక అనేసింది.

రోషములో అసూయ మేళవించగానే దత్తుగారి అమ్మాయి ముఖము కంద గడ్డవలె అయింది.

"నీకేం తెలుసు? ఆయన మా యింటికి వచ్చినప్పుడు భరతనాట్యాన్ని గురించి హేళనచేస్తూ-చాలా అసహ్యముగా మాట్లాడాడు" అన్నది

"అసంభవము! మీకాయన సంగతి పూర్తిగా తెలియదు" అని మీనాక్షమ్మ కూతురు గద్దించింది.

దత్తుగారమ్మాయి "మాకు ఆయన సంగతి తెలియదట గానీ- మీకేనా తెలిసింది ?" అని హేళనచేసింది.

అప్పటివరకూ ఊరుకున్న మీనాక్షమ్మ "అమ్మాయీ ; ఏమాటా తొందరపడి అనకూడదు. మా అమ్మాయీ-అతడూ పరస్పరమూ అభిమానముతో మెలగుతున్నారు. మేము వాళ్ళకు నిశ్చితార్థము చేద్దామనుకుంటున్నాము. మరి.... ఆయన సంగతి దానికి తెలియకుండానే మాట్లాడిందంటావా ?" అన్నది మందలింపుగా.

ఆ అమ్మాయి తెల్లబోయి "ఈ సంగతి ఆయనకు తెలుసునా ?" అన్నది.

"మేమే అనుకున్నాము. ఒక మంచిరోజు చూసి ఆయనతో చెప్పాలనుకుంటున్నాము" అన్నది.

దత్తుగా రమ్మాయిలు చేతిలో ఉన్న బంతులు అక్కడ పడేసి ఇంటితోవ పట్టారు.

మీనాక్షమ్మ కూతుళ్ళను తీసుకొని ఇంటికి వెళ్ళుతూ "అయినా దత్తుగా రమ్మాయిలకు బొత్తిగా మర్యాద తెలియదు. తమకే అన్నీ తెలుసునని విరగబడిపోతారు" అన్నది.

శ్రావణమాసపు వర్షాలు నాలుగురోజులపాటు ఎవరినీ ఒకరి యింటినుంచి మరొకరి యింటికి పోనివ్వలేదు.

కాస్త తెరపిగా ఉన్ననాటి సాయంత్రము ఇన్‌స్పెక్టరుగారి నౌకరు అందరి యిళ్ళకూ ఒక్కొక్క బొమ్మ- చారెడు సున్నిపిండి చక్కిలాలూ పంచాడు ఏమిటంటే "అమ్మగారు అబ్బాయిగారిని ఎత్తుకొచ్చారు గదండీ !" అన్నాడు.